సిరిసిల్లలోని టీస్టాల్‌ను ట్రాక్టర్‌లో తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిరిసిల్లలో 'అధికార' ఆగడం

- ట్రేడ్ లైసెన్స్ సాకుతో టీస్టాల్ మూసివేత
- సామాన్లతో పాటు మున్సిపాలిటీకి తరలింపు
- కుటుంబ సభ్యులతో కలిసి బాధితుడి నిరసన
- కేటీఆర్ ఫోన్.. అండగా ఉంటానని భరోసా

సిరిసిల్ల టౌన్/ కలెక్టరేట్, ఫిబ్రవరి 21: సిరిసిల్ల మున్సిపల్ అధికారులు తీరు విమర్శలకు దారి తీస్తున్నది. ట్రేడ్ లైసెన్స్ సాకుతో గురువారం టీస్టాల్‌ను సీజ్ చేసిన అధికారులు, శుక్రవారం టీస్టాల్ డబ్బాను క్రేన్‌తో తొలగించి మున్సిపల్ భవనానికి తీసుకెళ్లారు. టీస్టాల్ తరలింపును అడ్డుకోబోయిన చిరు వ్యాపారి బత్తుల శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీనివాస్ మున్సిపల్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. తాను మొదటి నుంచి కేటీఆర్‌కు అభిమానినని, అందుకే హోటల్‌కు 'కేటీఆర్ టీ స్టాల్' అని పేరు పెట్టుకున్నానని, కేటీఆర్ ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకున్నానని తెలిపారు. కేటీఆర్ ఫొటో ఉన్నందునే అధికారులు తన హోటల్‌ను మూసివేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు హోటల్ వద్దకు చేరుకుని బత్తుల శ్రీనివాస్‌కు మద్దతు తెలిపారు. నిరసనలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు బొల్లి రామ్మోహన్, వెంగల శ్రీనివాస్, దార్ల సందీప్, అన్నారపు శ్రీనివాస్ తదితరులు శ్రీనివాస్‌కు భరోసా కల్పించారు. అండగా ఉన్నామని తెలిపారు.

గింత అన్యాయం చేస్తారా?: శ్రీనివాస్

మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన సందర్భంగా బత్తుల శ్రీనివాస్ మీడియాతో ఆయన మాట్లాడుతూ ''అయ్యా కలెక్టర్ సార్.. మీరు చెప్పినట్టుగానే ఫ్లెక్సీ తీయమంటే తీసేశాను. నాపై ఎందుకింత కక్షతో వ్యవహరిస్తున్నారు? గింత అన్యాయం చేస్తారా?' అంటూ ఆవేదన వెలిబుచ్చారు. సామాన్లతో పాటు డబ్బాను తీసుకపోవడంతో నా కుటుంబం రోడ్డునపడింది.

తమ్మీ శ్రీనివాస్.. నీ కుటుంబ బాధ్యత నాది

ఫోన్‌లో ఓదార్చిన కేటీఆర్

సిరిసిల్లలో హోటల్ తొలగింపు బాధితుడు శ్రీనివాస్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. ''తమ్ముడు.. శ్రీనివాస్ అధైర్యపడకు. నీ కుటుంబ బాధ్యత నాది. తొందర్లోనే వస్తా. దుకాణం కొత్తది పెట్టించి నేనే ప్రారంభిస్తా'' అంటూ భరోసానిచ్చారు. కాగా, చాయ్ హోటల్ నడుపుకుంటేగానీ పూట గడవని శ్రీనివాస్ కుటుంబం ప్రభుత్వ చర్యలతో రోడ్డునపడింది.

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబ సభ్యులు

కొత్త మెడికల్ కళాశాలతో డాక్టర్ కల నెరవేరింది

- గురుకులంలో చదివి కొత్త మెడికల్ కాలేజీకి వచ్చిన మా తండా నుంచి నేనే మొదటి ఎంబీబీఎస్ స్టూడెంట్‌ను
- సీఎం రేవంత్‌రెడ్డి సభలో వైద్యవిద్యార్థిని మనోగతం
- ఇవి కదా కేసీఆర్ ఆనవాళ్లు: హరీశ్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్

రేవంత్‌రెడ్డితో జరిగిన ముఖాముఖిలో మాట్లాడుతున్న వైద్య విద్యార్థిని సత్యజ్యోతి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నారాయణపేటలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమంలో ఓ విద్యార్థిని ప్రసంగం అందరినీ ఆకట్టుకున్నది. నారాయణపేట మెడికల్ కాలేజీ విద్యార్థిని సత్యజ్యోతి తన కుటుంబ, విద్యానేపథ్యంపై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, పలువురు మంత్రులు, అధికారుల సమక్షంలో విద్యార్థిని మాట్లాడుతూ 'నా పేరు సత్యజ్యోతి. మాది నల్లగొండ జిల్లా తిరుమలగిరిసాగర్ మండలం. నేను ఎంబీబీఎస్ విద్యార్థినిని. నేను రైతు కుటుంబం నుంచి వచ్చా. నేను 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు గురుకుల పాఠశాలలో చదివాను. అక్కడ చదివి ఇక్కడికి వచ్చాను. చిన్నప్పట్నుంచి డాక్టర్ అవ్వాలన్నది నా కల. గురుకులాల్లో చదివితే డాక్టర్ అవుతానో లేదో అనుకునేదాన్ని. ఇప్పుడు ఎంబీబీఎస్ చదువుతున్నాను. మా తండా నుంచి ఫస్ట్ ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థినిని నేనే. అందుకు నాకు చాలా గర్వంగా ఉంది. నాతోపాటు మా తల్లిదండ్రులు. మా ప్రజలందరూ గర్వంగా భావిస్తున్నారు. కొత్తగా మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడం వల్లనే నాలాంటి పేద విద్యార్థినికి, చాలామందికి వైద్యవిద్య చదువుకునే అవకాశం వచ్చింది. నాతో పాటు నా మిత్రులందరి తరఫున ధన్యవాదాలు తెలుపుకొంటున్నాను'. అనడంతో కాంగ్రెస్ నేతలకు నోట మాట రాలేదు. కేసీఆర్ హయాంలో నారాయణపేట జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు కావడం.. ఫ్రీ సీటుతో చదువుకోవడం ఇవన్నీ కేసీఆర్ ఆలోచనతోనే అంటూ జనం చర్చించుకున్నారు.

కేసీఆర్ వజ్రసంకల్పంతోనే బడుగులకు వైద్య విద్య: హరీశ్‌రావు

సీఎం రేవంత్‌రెడ్డి ఎంత చెరిపివేయాలని చూసినా తెలంగాణలో ప్రతి దిక్కున కేసీఆర్ ఆనవాళ్లు ఆయన్ను వెంటాడుతూనే ఉంటాయని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నాడు కేసీఆర్ వజ్రసంకల్పంతో చేపట్టిన మెడికల్ కాలేజీల్లో నేడు ఎంతోమంది బడుగు విద్యార్థులు వైద్యవిద్య చదువుతున్నారని తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన మనోగతం పంచుకున్నారు. 'రేవంత్ రెడ్డికి నిజాలు ఇష్టం లేకపోయినా అవి ఆయనను వెంటాడుతూనే ఉన్నాయి. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన కేసీఆర్ ఆనవాళ్లు రేవంత్‌రెడ్డికి కళ్లు తెరిపించిన సంఘటన ఇది. ఓ గిరిజన తండా నుంచి తొలిసారి ఎంబీబీఎస్ సీట్ సాధించి డాక్టర్ కాబోతున్న సత్యజ్యోతి విజయం ఎలా సాధ్యమైంది? కేసీఆర్ 250 గురుకులాలను 1020కి పెంచడం వల్ల, మెడికల్ కాలేజీలను 5 నుంచి 33కి పెంచడం వల్ల, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేసినందువల్ల, కేసీఆర్ వజ్రసంకల్పం వల్లే సత్యజ్యోతిలాంటి ఎందరో బడుగువర్గాల విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. కేసీఆర్ గారి ఆనవాళ్లు చెరిపేస్తే చెరిగిపోయేది కాదు రేవంత్‌రెడ్డీ.. అది తెలంగాణ ముఖచిత్రంపై ఆయన చేసిన చెరగని సంతకం!' అని సత్యజ్యోతి మాట్లాడిన వీడియో ట్యాగ్ చేశారు.

అర్థమైందా రేవంత్?

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

గురుకులాల నుంచి వైద్యవిద్యను అభ్యసిస్తున్న సత్యజ్యోతి వంటి విద్యార్థుల గురించి బీఆర్ఎస్ నేత, గురుకులాల పూర్వ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'గురుకులాల వల్ల ఎందరి జీవితాలు మారతాయో? మీరు మా మీద ఫేక్ కేసుల కోసం కోట్లు ఖర్చు పెట్టే బదులు అవే పైసలను ఈ పేద పిల్లల మీద పెట్టండి, కొంచెం పుణ్యమైనా దక్కుతుంది.. అర్థమైందా రేవంత్‌రెడ్డి' అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

దవాఖానలో చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ సక్రు

మాజీ సర్పంచ్‌పై హత్యాయత్నం

గార్ల, ఫిబ్రవరి 21 : మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సేరిపురం బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ ధరావత్ సక్రుపై శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సేరిపురం మాజీ సర్పంచ్ సక్రు గార్ల మండల కేంద్రానికి పురుగుమందు కోసం వచ్చాడు. తిరిగి వెళ్తున్నక్రమంలో మార్గమధ్యంలో పుణ్యతండా వద్ద గుర్తు తెలియని ఆరుగురు వ్యక్తులు కర్రలతో దాడి చేయగా తప్పించుకొని మామిడి తోటలోకి పరుగు తీశాడు. అక్కడ మిర్చి ఏరుతున్న వారు రావడంతో దుండగులు పారిపోయారు. ఈ మేరకు సక్రు తల్లి మణెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పెండ్లి పందిట్లో విషాదం

గుండెపోటుతో వధువు తండ్రి మృతి

కామారెడ్డి, ఫిబ్రవరి 21: పెండ్లి పందిట్లో కూతురి పెండ్లి జరిపిస్తున్న ఆ తండ్రి గుండె ఒక్కసారిగా ఆగిపోయిన విషాదకర ఘటన కామారెడ్డిలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లికి చెందిన కుడిక్యాల బాల్‌చంద్రం కుటుంబం కామారెడ్డిలో స్థిరపడింది. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. జ్ఞాపకశక్తి పోటీల్లో ఇద్దరు కూతుళ్లు అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాచారు. పెద్ద కూతురు కనక మహాలక్ష్మికి ఇటీవలే పెండ్లి ఖరారు చేశారు. శుక్రవారం కామారెడ్డిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పెండ్లికి ఏర్పాట్లు చేశారు. శాస్త్రోక్తంగా పెండ్లి జరుగుతున్న తరుణంలో బాల్‌చంద్రం పందిట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. బంధువులు తండ్రి మరణవార్త చెప్పకుండానే వివాహ క్రతువును పూర్తి చేయించారు. ఆ తర్వాత బాల్‌చంద్రం కన్నుమూసిన వార్త తెలియడంతో ఒక్కసారిగా ఫంక్షన్ హాల్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

కేటీఆర్ కేసులో పోలీసులకు నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావుపై ముషీరాబాద్, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో పోలీసులు తమ వాదనలతో కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎలాంటి సాక్ష్యాలు, ఆధారాల్లేకుండానే పోలీసులు తనపై కేసులు నమోదు చేశారంటూ కేటీఆర్ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. కాంట్రాక్టర్లు, బిల్డర్ల నుంచి వసూలు చేసిన రూ.2,500 కోట్లను సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పంపారంటూ 2024, మార్చి 27న కేటీఆర్ వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీకి చెందిన బీ శ్రీనివాసరావు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజకీయ కక్షతో పెట్టిన కేసును కొట్టేయాలని కేటీఆర్ తరఫు న్యాయవాది టీవీ రమణారావు వాదించారు. విచారణ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. ఈ కేసు విచారణ మార్చి 18కి వాయిదా పడింది.

మరో కేసు 12కు వాయిదా

ఎన్నికల ప్రచార ర్యాలీలో భాగంగా 2023, నవంబర్ 27న పటాకులు కాల్చి ప్రజలకు ఇబ్బంది కలిగించారంటూ అప్పటి ముషీరాబాద్ ఏఎస్ఐ ఆర్ ప్రేమ్‌కుమార్ ఫిర్యాదు చేశారని కేటీఆర్ తరఫు న్యాయవాది తెలిపారు. ప్రజలు ఫిర్యాదు చేయలేదని, పోలీసులే ఫిర్యాదు చేశారని, సాక్షులు కూడా పోలీసులేనని అన్నారు. ర్యాలీకి ముందస్తు అనుమతి తీసుకున్నారని, టపాసులతో ఇబ్బందులు పడినట్టు ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు. కేసు విచారణ ప్రక్రియను నిలిపివేయాలని, కేసును కొట్టేయాలని కోరారు. పిటిషన్ దాఖలు చేసిన వారిలో కేటీఆర్‌తో పాటు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కూడా ఉన్నారు. తదుపరి విచారణ మార్చి 12కు వాయిదా పడింది.

ఫోన్ ట్యాపింగ్‌పై స్టే ఎత్తివేతకు నిరాకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ పోలీసు అధికారి రాధాకిషన్‌రావుపై నమోదైన ఫోన్‌ట్యాపింగ్ కేసు దర్యాప్తును నిలిపివేస్తూ వెలువరించిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ కేసులో ఇతర నిందితులను కస్టడీకి కోరిన నేపథ్యంలో దర్యాప్తును కొనసాగించడానికి అనుమతించాలంటూ పోలీసులు దాఖలుచేసిన మధ్యంతర పిటిషన్‌పై విచారణను ఈ నెల 27కు వాయిదా వేస్తూ జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పోలీసుల మధ్యంతర పిటిషన్, కేసును కొట్టివేయాలని, బెయిలు మంజూరు చేయాలని కోరుతూ హరీశ్‌రావు, రాధాకిషన్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై సమగ్ర విచారణ చేస్తామని చెప్పారు. పోలీసుల తరఫున పీపీ నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ ఈకేసులో 3,4,5వ నిందితులకు కింది కోర్టు బెయిలు మంజూరు చేసిందన్నారు. కేసు దర్యాప్తునకు అనుమతించాలని కోరారు. బెయిలు మంజూరయ్యాక మధ్యంతర పిటిషన్‌పై విచారణ అవసరం ఏమున్నదని జడ్జి ప్రశ్నించారు. ఈ నెల 27న విచారిస్తామని, వాయిదాలు కోరవద్దని స్పష్టంచేశారు.

బార్ అసోసియేషన్ల పిటిషన్లపై 25న విచారణ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని బార్ అసోసియేషన్‌ల ఎన్నికల గడువుకు సంబంధించి రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఈ నెల 25న విచారణ చేపడతామని హైకోర్టు పేర్కొంది. బార్ అసోసియేషన్ పాలకవర్గం పదవీ కాలాన్ని రెండేండ్ల పాటు పొడిగించాలన్న అభ్యర్థనను రాష్ట్ర బార్ కౌన్సిల్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్‌తోపాటు మరో 24 అసోసియేషన్‌లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు.

ఖమ్మంలో విద్యార్థిని ఆత్మహత్య

ఖమ్మం అర్బన్/ రఘునాథపాలెం, ఫిబ్రవరి 21 : ఖమ్మంలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం చింతలగూడేనికి చెందిన యోగానందిని(16) ఖమ్మం నగరంలో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నది. శుక్రవారం ఉదయం కళాశాల హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కళాశాల యాజమాన్యం ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. యోగానందిని చేతికి ఇటీవల సర్జరీ కావడంతో కళాశాలలో జరిగే పరీక్షలు రాయలేకపోయింది. దీంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్టు తండ్రి సత్యరాజు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఖానాపురం హవేలీస్టేషన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఆమనగల్లు గురుకుల పాఠశాలలో ఘటన

షాబాద్, ఫిబ్రవరి 21 : ఓ విద్యార్థిని స్పిరిట్ తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలోని ఆమనగల్లు గురుకుల పాఠశాలలో జరిగింది. పదోతరగతి చదువుతున్న శ్రీజ అనే విద్యార్థిని.. తోటి విద్యార్థిని మాట్లాడటం లేదని మనస్తాపం చెంది శుక్రవారం ఉదయం స్పిరిట్ తాగింది. గమనించిన ఉపాధ్యాయులు వెంటనే చికిత్స నిమిత్తం నగరంలోని ఉస్మానియా దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతున్నది. ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నదని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, సీఐ కాంతారెడ్డి, ఎస్సై రమేశ్ పాఠశాలకు చేరుకుని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్నేహితురాలు తనతో మాట్లాడకపోవడంతోనే శ్రీజ స్పిరిట్ తాగిందని వారు తెలిపారు. విద్యార్థిని ఆరోగ్యం బాగున్నదని ప్రిన్సిపాల్ వినోల మీడియాకు చెప్పారు.

ఫిర్యాదుదారే లేనప్పుడు కేసు ఎలా?

- మేడిగడ్డపై డిఫ్యాక్టో కంప్లెయినెంట్ మృతిపై హైకోర్టు ప్రశ్న
- కేసును అనుమతిస్తే.. ఎవరిని మేము విచారించాలి?
- ఫిర్యాదులోని అంశాలపై ఎవరు వివరణ ఇస్తారు?
- కోర్టు ఎవరి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయాలి?
- ప్రభుత్వ వాదనను తీవ్రంగా తప్పుపట్టిన హైకోర్టు
- 4 కోట్ల తెలంగాణలో ఆ ఒక్కడే ఉన్నాడా? అని వ్యాఖ్య
- కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్‌పై విచారణ 24కు వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లిలోని మేడిగడ్డ కుంగుబాటుపై కింది కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు చేసిన వ్యక్తి మరణించిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై విచారణ అవసరం లేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఫిర్యాదుదారుడు రాజలింగమూర్తి మరణించినట్టు పత్రికల్లో వార్తలు వచ్చాయని, ఈ విషయాన్ని ఆయన తరఫు న్యాయవాది కూడా నిర్ధారణ చేస్తున్నందున ఇక విచారణకు ఆస్కారం లేదని స్పష్టం చేసింది. ఇందులో ప్రజాప్రయోజనం ఉందని, ఫిర్యాదుదారుడు మృతి చెందినప్పటికీ ఫిర్యాదులోని అంశాల ఆధారంగా విచారణ కొనసాగించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెప్పడంతో తదుపరి విచారణ ఈ నెల 24న చేపడతామని ప్రకటించింది. మేడిగడ్డ కుంగుబాటుపై విచారణ చేపట్టాలని భూపాలపల్లి ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి తీసుకున్న నిర్ణయాన్ని నిలిపివేస్తూ గతంలో జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను మరోసారి పొడిగించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

మేడిగడ్డ కుంగుబాటు వ్యవహారంపై ప్రైవేట్ ఫిర్యాదును భూపాలపల్లిలోని మేజిస్ట్రేట్ కోర్టు గత ఏడాది జనవరి 12న కొట్టివేసింది. దీనిని సమీక్ష చేయాలని కోరుతూ నాగవల్లి రాజలింగమూర్తి దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి విచారించి ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు, నాటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో సవాలు చేశారు. జిల్లా కోర్టు తీసుకున్న నిర్ణయం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడు సామాజిక కార్యకర్త నాగవల్లి రాజలింగమూర్తి తన వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని గత విచారణ సమయంలో హైకోర్టు నోటీసులు జారీచేసింది. ఈ వ్యాజ్యం శుక్రవారం మరోసారి విచారణకు వచ్చిన వెంటనే న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ కల్పించుకొని, రాజలింగమూర్తి మరణించినట్టు పత్రికల్లో వచ్చిన వార్తను చదివానని చెప్పారు.

ఫిర్యాదుదారుడు జీవించి లేనప్పుడు ఫిర్యాదు మనుగడలో ఉండదని అన్నారు. ఇంతలో పీపీ కల్పించుకుంటూ సుప్రీంకోర్టు, కర్ణాటక హైకోర్టుల తీర్పుల ప్రకారం ఫిర్యాదుదారుడు మరణించినప్పటికీ కేసు విచారణ చేయవచ్చునన్న తీర్పుల ప్రతులను అందజేస్తామని చెప్పడంతో విచారణ వాయిదా పడింది.

చనిపోయిన వ్యక్తి తరఫున ఎలా వాదిస్తారు?

చనిపోయిన క్లయింట్ తరఫున ఎలా వాదిస్తారు అని రాజలింగమూర్తి తరఫు న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. ఫిర్యాదుదారుడు మరణించిన నేపథ్యంలో జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అనుమతిస్తే, విచారణ ఎలా జరుగుతుందని ప్రశ్నించింది. ప్రజాప్రయోజనంగా ఫిర్యాదును చూడాలని పీపీ చెప్పడంపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఫిర్యాదుదారుడు మరణించినందున కావాలంటే మళ్లీ మరో ఫిర్యాదు చేసుకోవచ్చునని సూచించారు. రాజలింగమూర్తి ఫిర్యాదు ఆధారంగా విచారణ కొనసాగాలని కోరేందుకు చట్ట ప్రకారం వీల్లేదని తేల్చి చెప్పారు. తెలంగాణలో రాజలింగమూర్తి ఒక్కరే లేరని, నాలుగు కోట్ల మందిలో ఎవ్వరైనా పిల్ దాఖలు చేయవచ్చునని, ఈ రోజే ఇదే హైకోర్టులో పిల్ దాఖలు చేసుకోవచ్చునని చెప్పారు.

ఎవరి స్టేట్‌మెంట్ నమోదు చేయాలి?

జిల్లా కోర్టు ఆర్డర్ అసంబద్ధమైనదనే తాను గతంలోనే స్టే ఇచ్చినట్టు జస్టిస్ లక్ష్మణ్ చెప్పారు. ఫిర్యాదుదారుడు జీవించి లేనప్పుడు కోర్టు ఎవరి స్టేట్‌మెంట్ నమోదు చేస్తుందని, ఎవరిని విచారిస్తుందని, కేసును ఎలా విచారణ చేస్తుందని ప్రశ్నించారు. ఈ దశలో మళ్లీ పీపీ కల్పించుకుని, కోట్ల రూపాయలతో నిర్మాణం జరిగిన అంశంపై రాజలింగమూర్తి ఫిర్యాదు చేశారని చెప్పబోగా న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. తాను కేసు మెరిట్స్‌లోకి వెళ్లడంలేదని, డిఫ్యాక్టో కంప్లయినెంట్(కింది కోర్టులోని ఫిర్యాదుదారుడు) మరణించిన తర్వాత దానిపై దాఖలైన పిటిషన్‌పై విచారణ చేయాలా.. వద్దా.. అనే అంశానికి మాత్రమే పరిమితం అవుతున్నట్లు చెప్పారు. కోర్టు ఆఫీసర్‌గా మెరిట్స్ ఆధారంగా వాదనలు వినిపించాలేగానీ, సహనాన్ని పరీక్షించొద్దని అన్నారు. ఫిర్యాదుదారుడే జీవించి లేనప్పుడు కేసు విచారణలో కోర్టు ఎవరిని ప్రశ్నిస్తుంది, ఫిర్యాదులోని అంశాలపై ఎవరు వివరాలు ఇస్తారు అని నిలదీశారు.

శషభిషలు అక్కర్లేదు..

కేసీఆర్, హరీశ్‌రావు తరఫు న్యాయవాది టీవీ రమణారావు వాదనలు వినిపిస్తూ, మేజిస్ట్రేట్ కోర్టు ఫిర్యాదును కొట్టేస్తూ తీర్పు చెప్పినప్పటికీ జిల్లా కోర్టు అనుమతించడం చెల్లదన్నారు. ప్రైవేట్ ఫిర్యాదుపై విచారించే పరిధి తమకు లేదంటూ మేజిస్ట్రేట్ సరైన నిర్ణయమే తీసుకున్నారన్నారు. మేజిస్ట్రేట్ తుది నిర్ణయానికి వచ్చారని, దీనిపై రివ్యూ చేసే పరిధి సెషన్స్ జడ్జికి ఉండదని చెప్పారు. ఫిర్యాదుదారుడు మరణించిన కారణంగా శషభిషలు అవసరం లేదని, జిల్లా కోర్టులోని కేసు విచారణ కొనసాగింపునకు ఏ దశలోనూ ఆస్కారం లేదని చెప్పారు. జిల్లా జడ్జి గత ఏడాది జూలై 10న జారీ చేసిన ఉత్తర్వులను కొట్టేయాలన్నారు.

వాయిదా వేయండి: పీపీ

ఫిర్యాదుదారు మరణించితే కేసుకు చెల్లుబాటు ఉండదని న్యాయమూర్తి అన్నారు. ఇందుకు అనుగుణంగా ఉత్తర్వులను జారీ చేస్తుండగా.. పీపీ కల్పించుకుంటూ విచారణను వాయిదా వేయాలని కోరారు. ఫిర్యాదుదారుడు జీవించి లేకపోయినప్పటికీ కేసు మనుగడలోనే ఉంటుందని సుప్రీంకోర్టు, కర్ణాటక హైకోర్టుల తీర్పులను ఉదహరించేందుకు గడువు ఇవ్వాలని కోరారు. ఇందుకు అనుమతించిన న్యాయమూర్తి విచారణను 24వ తేదీకి వాయిదా వేశారు.

చెల్లని సీఎంఆర్ఎఫ్ చెక్కు

- డబ్బులు రాక లబ్ధిదారు ఆందోళన
- రెండుసార్లు చెక్కు మార్చినా అందని సీఎంఆర్ఎఫ్ పరిహారం

గంగాధర, ఫిబ్రవరి 21 : శస్త్ర చికిత్స చేసుకుని సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆ లబ్ధిదారుకు నిరాశే ఎదురైంది. ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్న చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేస్తే దానిపేరున ఇదివరకే వేరొకరు నగదు తీసుకున్నారని సిబ్బంది చెప్పడంతో ఖంగుతిన్నది. హైదరాబాద్‌కు తిప్పి పంపితే మరో చెక్కు రాగా, మళ్లీ అదే పరిస్థితి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకంపల్లికి చెందిన పిట్టల లలిత రెండేళ్ల క్రితం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో శస్త్ర చికిత్స చేయించుకుని సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకుంది. గతేడాది జూలై నెలలో 12 వేల పరిహారం మంజూరైంది. గంగాధరలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా 16 జూలై 2004న చెక్కును తీసుకున్న లలిత గర్భకుర్తి గ్రామీణ బ్యాంకులో డిపాజిట్ చేయడానికి వెళ్లింది. ఇదివరకే చెక్కు వేరొకరు ఆ డబ్బులు తీసుకున్నట్టు బ్యాంకు అధికారులు తెలిపారు. స్థానిక నాయకులతో చెప్పగా చెక్కును హైదరాబాద్‌కు పంపించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కును చూపుతున్న పిట్టల లలిత భర్త వెంకటేశం

తిరిగి అదే చెక్కును 776140 నంబర్ చెక్కును 30 జనవరి 2025గా మార్చి పంపించారు. మరోసారి చెక్కును డిపాజిట్ చేయడానికి అదే బ్యాంకుకు లలిత భర్త వెంకటేశం వెళ్లగా చెక్కు నంబర్ మారితేనే డబ్బులు వస్తాయని సిబ్బంది తెలపడంతో నిరాశగా వెనుదిరిగాడు. అధికారులు స్పందించి సీఎంఆర్ఎఫ్ పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.

- వరద బాధితుల కోసం పడవ తయారు చేసిన విద్యార్థులు

*నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని ముష్టిపల్లి జిల్లా పరిషత్ విద్యార్థులు వరద బాధితుల కోసం ఇంట్లో ఉండే వస్తువులతో పడవ తయారు చేసి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. శుక్రవారం డీఈవో రమేశ్‌కుమార్ పడవ తయ